ప్రజాశక్తి
ఆదివారం 6 ఏప్రిల్ 2025
5
విజయనగరం

డైట్‌లో డెప్యుటేషన్‌పై పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థలో డెప్యుటేషన్‌పై అధ్యాపకులుగా పనిచేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు డిఇఒ యు.మాణిక్యం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. డైట్ కళాశాలలో 6 సీనియర్ లెక్చరర్స్, 17 లెక్చరర్స్ మొత్తం 23 పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నామన్నారు. 58 సంవత్సరాల లోపు వయస్సు గల ఉమ్మడి విజయనగరం జిల్లాలో పనిచేస్తున్న ఆసక్తి గల ఎంఇఒలు, హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్ ఈనెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులకు 16, 17 తేదీలలో రాత పరీక్ష, 19న ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు.

రాజకీయ తాబేదార్ల వల్లే వెనుకబాటు

- వనరుల సద్వినియోగం ద్వారానే అభివృద్ధి
- ప్రజలు చైతన్యవంతులు కావాలని వక్తలు పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బ్రిటీష్ వాడికి అత్యధిక పన్నులు చెల్లించిన విజయనగరం ప్రాంతం నేడు అభివృద్ధికి నోచుకోకపోవడానికి కారణం రాజకీయ తాబేదార్లే అని పలువురు వక్తలు అన్నారు. జిల్లాలో ఉన్న వనరుల వినియోగించుకోవడం ద్వారానే అభివృద్ధి సాధ్యమని, అందుకు ప్రజలు చైతన్య వంతులు కావాల్సిన అవసరం ఉందని పిలుపు ఇచ్చారు. శనివారం స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'విజయనగరం సమగ్రాభివృద్ధి- అవసరాలు- అవకాశాలు'పై సెమినార్ జరిగింది. ప్రారంభ సభలో ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ఎస్.అప్పలనాయుడు మాట్లాడుతూ విజయనగరం అన్ని రంగాల్లో వెనుకబడి ఉందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించడంలోనూ, వలసలు నివారించడంలో, పరిశ్రమలు ఏర్పాటు చేయడంలో, ఉన్న నీటి వనరులు సద్వినియోగం చేసుకోవడంలో పాలకులు నిర్లక్ష్యం కారణంగా వెనుకబడి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తొలుత బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం శ్రీనివాస అధ్యక్షతన వివిధ అంశాలపై వక్తలు ప్రసంగించారు. సెమినార్‌లో పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, సాహితీ స్రవంతి కన్వీనర్ చీకటి దివాకర్, ఆహ్వాన సంఘం చైర్మన్ కె.శివానందకుమార్, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు, ప్రజా సంఘాలు నాయకులు, మేధావులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ కెఎస్ చలం

ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి

ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ కెఎస్ చలం

'అభివృద్ధి-దాని ప్రాధాన్యత' అంశంపై ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ కెఎస్ చలం మాట్లాడుతూ మద్రాసు రాష్ట్రంలో కలిసి ఉన్నప్పుడు ప్రధానిని అందించిన నేల ఇది అన్నారు. బ్రిటిష్ కాలంలో అత్యధిక పన్నులు కట్టిన నుంచి నేడు బతకడం కోసం వలసలు పోతున్న ప్రాంతంగా మారిందన్నారు. అభివృద్ధికి దూరం కావడానికి కారణం రాజకీయ తాబేదార్ల నని అన్నారు. పుష్కలంగా సహజవనురులు లభ్యమయ్యే ఈ ప్రాంతం కేవలం రాజకీయ నాయకులు కారణగానే అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ భూములను రాజకీయ తాబేదార్లు అమ్మేస్తున్నారని ఆవేదన చెందారు. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి ప్రభుత్వాలను, పాలకులను నిలదీయడం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.

ముక్త కంఠంతో నినదిస్తేనే అభివృద్ధి

కథా రచయిత గంటేడ గౌరునాయుడు

ప్రజలంతా ముక్త కంఠంతో నినదిస్తేనే తప్ప విజయనగరం అభివృద్ధి సాధ్యం కాదన్నారు. పాడి పంటలు కలిగిన ఈ ప్రాంతం అభివృద్ధి కాకపోవడానికి పాలకులు వనరులను వినియోగించకపోవడమేనని అన్నారు. ఉన్న పరిశ్రమలు మూతపడటం వలన ఉపాధి పోయి వలసలు పెరిగాయన్నారు. ఇటువంటి విధ్వంస పాలనలో గుండెలు మండటం లేదా అని ప్రశ్నించారు. ఎవరు తీర్చగలరు గుండె మంట అని ఆయన పాడిన పాట సదస్సుకు వచ్చిన వారిని ఉత్తేజ పరిచింది.

భూ విధ్వంసాన్ని అడ్డుకోవాలి

ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు

నేడు మన ప్రాంతం అభివృద్ధి కావాలంటే ప్రధానమైన వనరు భూమిని కాపాడుకోవాలని ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. విజయనగరం- సాంస్కృతిక రంగం ప్రాధాన్యతపై ఆయన మాట్లాడారు. నేడు పాలకులు పాల్పడుతున్న భూ విధ్వంసాన్ని అడ్డుకోవడం ద్వారానే అభివృద్ధి సాధ్యమన్నారు. హరికథా పితామహుడు, కలియుగ భీముడు, వయోలిన్ విధ్వాంసుడు, గురజాడ పుట్టిన నేల విజయ నగరమని, అటువంటి నగరం అభివృద్ధికి నోచుకోకపోవడానికి పాలకులే కారణమన్నారు. 90 శాతం శ్రమ జీవులు ఉన్న ఈ ప్రాంతంలో భూములు, సహజవనర్లు కాపాడుకోవడం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

పాలకుల నిర్లక్ష్యమే కారణం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు జివిఎస్ జయపాల్

జిల్లాలో ఉన్న నీటి వనరులు సద్వినియోగం చేసుకోవడంలో పాలకులు నిర్లక్ష్య వైఖరి కారణంగానే అభివృద్ధికి దూరంగా జిల్లా ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు జివిఎస్ జయపాల్ అన్నారు. 'నీటి వనరులు-అవసరాలు-అవకాశాలు'పై ఆయన మాట్లాడారు. 9 జీవ నదులు, 8 ప్రాజెక్టులు, 2.76 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నా, సాగు నీరు మాత్రం 1/3 భూమికి మాత్రమే అందుతుందన్నారు. మిగిలిన 69 శాతం నీరు వృధాగా పోతోందన్నారు. ఎత్తి పోతల పథకాలు నిర్మించడం ద్వారా లక్షలఎకరాలు భూములకు సాగు నీరు లభ్యమవుతుందన్నారు. అటువంటి ప్రయత్నాలు చేయకపోవడం వలన సన్న,చిన్న కారు రైతులు వలసలు పోతున్నారన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసుకోవడం ద్వారానే జిల్లా అభివృద్ధి సాధ్యమని అన్నారు.

మంచి ఆరోగ్యం, విద్య ద్వారానే అభివద్ధి

డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు

మంచి ఆరోగ్యం, మంచి విద్య, మంచి నైపుణ్యం కల్పించినపుడు అభివృద్ధి సాధ్యమని డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. పర్యావరణం-ఆరోగ్యవ్యవస్థ అనే అంశంపై ఆయన మాట్లాడారు. అభివృద్ధిలో ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా విజయనగరం ఉందన్నారు. మంచి ఆరోగ్యం ప్రజలకు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం, మంచి ఆరోగ్యం ప్రభుత్వాలు కల్పించడం ద్వారా అభివృద్ధికి దోహదం చేస్తాయని అన్నారు.

రాష్ట్రాన్ని అమ్మేయడమే ప్రభుత్వ ధ్యేయం

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

'విజన్ 2047' అంశంపై మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ విజన్ 47 అంటే ప్రజలను చీకట్లో పెట్టి రాష్ట్రాన్ని, రాష్ట్ర సంపదను పెట్టుబడి దారులకు అమ్మేయడం తప్ప మరొకటి కాదన్నారు. దేశంలో నయా ఉదారవాద విధానాలు అమలు జరుగుతున్నంత కాలం ఏ ప్రాంతమూ అభివృద్ధి కాదన్నారు. నేడు వ్యక్తిగత అభివృద్ధి అనిఆలోచించే స్థితిలో ఉన్నప్పుడు రాష్ట్రం,జిల్లా అభివృద్ధి అనేది సాధ్యం కాదన్నారు. ప్రజలను రాజకీయాలకు దూరంగా ఉంచడమే అభివద్ధి వెనుకబాటుకు కారణమన్నారు. నయా ఉదారవాద విధానాలు కారణంగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రస్తుతం అభివృద్ధికి నిధులు కేటాయింపు అడగడమకంటే ఉన్న సహజ వనరులను కాపాడుకోవడమేనన్నార. విజన్ 2047 ద్వారా ప్రభుత్వ ఆస్తులు, సహజ వనరులను, రాష్ట్రాన్ని అమ్మేయకుండా ప్రజలు కాపాడుకోవాలన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలి

యుటిఎఫ్ నాయకులు డి.రాము

ప్రభుత్వ విద్యా రంగాన్ని రక్షించుకోవడం ద్వారానే మెరుగైన విద్య అందుతుందని యుటిఎఫ్ విద్యా విభాగం రాష్ట్ర కమిటీ సభ్యుయు డి.రాము అన్నారు. ఎన్ఇపి నేపథ్యంలో విద్యారంగంపై ఆయన మాట్లాడారు. నేడు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు కారణంగా ప్రభుత్వ విద్య పేదలకు,సామాన్యులకు పెను భారంగా మారుతుందన్నారు. జిల్లాలో 191 పాఠశాలలను ఇప్పటికే మూసేశారని, మరో 283 పైగా పాఠశాలలు మూసేందుకు రంగం సిద్ధం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అంటే ప్రైవేటు విద్యను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విద్యను ప్రజలకు దూరం చేసే పని ప్రభుత్వాలు చేస్తున్నాయన్నారు. నగరంలో లక్ష జనాభా ఉన్నప్పుడు ఉన్న మూడు హైస్కూల్సు తప్ప 3లక్షల జనాభా పెరిగినా పాఠశాలలు మాత్రం పెరగలేదన్నారు. నగరంలో చదువుకోవాలి అంటే డబ్బులిచి కొనుక్కోవాలి తప్ప ప్రభుత్వ విద్య అందే పరిస్తితి లేదన్నారు. పౌర సమాజం ప్రభుత్వ విద్యను రక్షించుకోవాల్సిన అవసరం, కర్తవ్యం ఉందన్నారు.

బాధితురాలిని పరామర్శిస్తున్న ఎంపి కలిశెట్టి, కిమిడి నాగార్జున

శివరాంలో దారుణం

- యువతిని కత్తితో పొడిచి పరారైన దుండగుడు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి వకుల్ జిందాల్
- బాధితురాలికి ఎంపి కలిశెట్టి, జెడ్‌పి చైర్మన్ పరామర్శ

ప్రజాశక్తి-చీపురుపల్లి

గరివిడి మండలం శివరాంలో దారుణం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కోండ్రు అఖిల (18) అనే యువతిపై గుర్తు తెలియని వ్యక్తి కత్తితో పొడిచి పరారయ్యాడు. శనివారం మధ్యాహ్నం అఖిల తన ఇంట్లో ఉండగా మాస్కు ధరించిన ఓ వ్యక్తి వచ్చి ఆమెపై దాడికి పాల్పడ్డాడు. తనతో తెచ్చుకున్న కత్తితో కడుపులో పొడిచి పరారయ్యాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమె కేకలు వేయడంతో ఆమె నాన్నమ్మతో పాటు కుటుంబ సభ్యులు వెంటనే వచ్చి ఆమెను చీపురుపల్లి ఆసుపత్రికి, అక్కడ నుండి మెరుగైన చికిత్స కోసం విజయనగరం తిరుమల మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌పి వకుల్ జిందాల్, చీపురుపల్లి డిఎస్‌పి రాఘవులు, సిఐ కె.అశోక్‌కుమార్, అక్కడికి చేరుకొని పరిశీలించారు. క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్ వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించాయి. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ కేసు మిస్టరీని త్వరలో ఛేదిస్తామని తెలిపారు. ఇందుకోసం ఐదు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. నేర స్థలం నుండి కొన్ని సాంకేతిక ఆధారాలను సేకరించామన్నారు. త్వరలో కేసు మిస్టరీని ఛేదించి, నిందితులను అరెస్టు చేస్తామని తెలిపారు. ఎస్‌పి వెంట రాజాం రూరల్‌సిఐ ఉపేంద్రరావు, ఎస్‌బిసిఐ ఎవి లీలారావు, తదితరులు ఉన్నారు. అయితే అదే గ్రామానికి చెందిన యువకుడు ఆ దాడికి పాల్పడినట్లు తెలిసింది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాసరావు సూచించారు. ప్రశాంతంగా ఉండే ఈ జిల్లాలో ఇలాంటి ఘటనలు జరగడం విచారకరమని అన్నారు.

విష సంస్కృతి బాధాకరం : ఎమ్‌పి

ప్రశాంతమైన పల్లెల్లోనూ మహిళలపై దాడులు వంటి విష సంస్కృతి రావడం బాధాకరమని విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న యువతిని పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ నిందితుడికి కఠిన శిక్ష తప్పదని తెలిపారు. మహిళలపై దాడులు చేసే వారి పట్ల కూటమి ప్రభుత్వం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. చట్టాలు ఎంత కఠినంగా అమలవుతున్నప్పటికీ.. ఇటువంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. బాధితురాలికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు. యువతిని పరామర్శించిన వారిలో టిడిపి నాయకులు సువ్వాడ వనజాక్షి, కుమిలి శ్రీనివాసరావు, జి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

లా అండ్ ఆర్డర్ గాడి తప్పింది

విజయనగరంటౌన్ : రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా గాడి తప్పిందని వైసిపి జిల్లా అధ్యక్షులు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గరివిడి మండలం శివరాంలో యువకుడి చేతిలో కత్తిపోటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చెందిన యువతిని ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 10నెలల నుంచి రాష్ట్రంలో ఏదో ఒక చోట జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, హత్యలు జరుగుతున్నా యని, వీటిని అరికట్టాలంటే రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టాలని అన్నారు. గాయపడిన యువతి అఖిలకు అన్ని విధాలుగా తోడుగా నిలుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వైద్యఖర్చుల కోసం ఆమె కుటుంబ సభ్యులకు రూ. 50వేలు నగదును వైసిపి గరివిడి మండల అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావు. జిల్లా యాదవ మహిళల అధ్యక్షులు గదుల సత్యాలత చేతులు మీదుగా అందజేశారు. కార్యక్రమంలో శివరాం గ్రామ సర్పంచ్ శ్రీధర్. ఎంపిటిసి దాలినాయుడు, మందిరవలస ఎంపిటిసి పోలీసునాయుడు, బిజె పాలెం సర్పంచ్ రమణ తదితరులు ఉన్నారు.

జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, ఎమ్మెల్సీ రఘురాజు,అధికారులు

విద్యారంగ పరిరక్షణకు కృషి చేయండి

ప్రజాశకి-విజయనగరం టౌన్

విద్యారంగ పరిరక్షణకోసం, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అధితి విజయలక్ష్మి గజపతిరాజును యుటిఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు శనివారం ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. యుటియఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, జిల్లా కోశాధికారి చింత భాస్కరరావు, రాష్ట్ర అకాడమిక్ కమిటీ సభ్యులు డి రాము, జిల్లా కార్యదర్శులు సిహెచ్ తిరుపతి నాయుడు, ఎన్. సత్యనారాయణ, జి.రాజారావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి రాంప్రసాద్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కిల్లాడ అప్పారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు మురళి మోహన్, పలు మండలాల యుటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతినిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఘనంగా ద్వారం సహస్ర చంద్ర దర్శనం సభ

ప్రజాశక్తి -విజయనగరం ప్రతినిధి

వాయులీన విద్యా ప్రవీణ, సంగీత విద్యానిధి ద్వారం దుర్గా ప్రసాదరావు సహస్ర చందన దర్శనం సభ శనివారం సాయంత్రం సంగీత కళాశాలలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిధిగా స్థానిక ఎంఎల్ఎ పి.అదితి గజపతి రాజు హాజరయ్యారు. సభకు అధ్యక్షులుగా విశాఖ డాన్స్ మ్యూజిక్ అకాడమీ అధ్యక్షులు గుమ్మలూరి రాంబాబు వ్యవహరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత మండా సుధారాణి హాజరయ్యారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ శాస్త్రి, అధ్యాపకులు రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ద్వారం దుర్గాప్రసాద్, సుధారాణి

జగ్జీవన్‌రామ్ ఆశయాలను కొనసాగించాలి

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం

బడుగు బలహీనవర్గాల నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ బాబూ జగ్జీవన్ రాం 118వ జయంతి వేడుకలు నగరంలోని కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో శనివారం ఘనంగా జరిగాయి. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొని బాబూ జగ్జీవన్ రాం చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ రిజర్వేషన్ ఫలాలు అనుభవించి ఉన్నతస్థాయికి చేరిన బడుగువర్గాలకు చెందిన అధికారులు, ఉద్యోగులంతా తమ తోటి పేదకుటుంబాలకు చేయూత ఇచ్చి వారు కూడా ఉన్నతస్థాయికి చేరుకునేలా సహాయం అందించిన నాడే జగజ్జీవన్ రామ్‌కు సరైన నివాళి కాగలదని అన్నారు. బడుగువర్గాల వారు విద్యతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం పొందగలుగుతారని అన్నారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్ పర్సన్ పాలవలస యశస్విని, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, సాంఘిక సంక్షేమ అధికారి బి.రామానందం, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీపురుపల్లి, వియ్యంపేట, వేపాడ అంబేద్కర్ గురుకులాల విద్యార్థులు జగ్జీవన్ రాం జీవిత విశేషాలపై సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించిన విద్యార్థులను ప్రముఖులు సత్కరించారు. అనంతరందళిత బహుజన శ్రామిక యూనియన్ అధ్యక్షుడు పి.చిట్టిబాబు, బిఎస్‌పి జిల్లా అధ్యక్షుడు కె.సోములు, సామాజిక కార్యకర్త పి.సూర్యనారాయణ, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు గోగు శ్రీను, తదితరులు మాట్లాడారు.

ట్రెజరీ సర్వీస్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - విజయనగరం

ఉమ్మడి విజయనగరం జిల్లా ట్రెజరీ సర్వీసు అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. అధ్యక్షులుగా డి.నవీన్‌చంద్ , అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.సురేష్ కుమార్, సెక్రటరీగా కెవిఎస్ఎస్ సింధూర, వైస్ ప్రెసిడెంట్లుగా ఎస్.దివ్య భారతి, పి.సంతోష్ కుమార్, వై.కామినాయుడు, బివిఎస్‌ఎం నాయుడు, జాయింట్ సెక్రెటరీలుగా వి.సరస్వతమ్మ, టి.అనిల్, ఎస్.రంజిత్ కుమార్, కోశాధికారిగా జి.ప్రశాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఎన్నికల అధికారిగా పి.కిరణ్ కుమార్, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా ఎస్.భాస్కర్, పరిశీలకులుగా డి.రమణరెడ్డి వ్యవహరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెన్షనర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పెద్దింటి అప్పారావు, జి.నారాయణ, నాయుడు జగన్నాధం, కామరాజు, సత్యం నాయుడు, ఎపి ఎన్‌జిజిఒ జిల్లా, పట్టణ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.శ్రీధర్ బాబు, ఆవు సురేష్, వై.ఆనంద్‌కుమార్, ఎ.కనకరాజు కోశాధికారి ఎస్‌వి సుధాకర్, అసోసియేట్ ప్రెసిడెంట్ జివిఆర్ఎస్ కిషోర్ కుమార్ హాజరయ్యారు.

ఆక్రమణల నుంచి రికార్డుల ట్యాంపరింగ్ వరకు..

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఒకప్పుడు గ్రామాల్లో కుటుంబ బలం, బలగం అండచూసుకుని పొలాల్లో గట్టులు, పుట్టలు కలుపుకోవడం చూశాం. ఆ తరువాత ప్రభుత్వ భూములు ఆక్రమించుకోవడం, రాజకీయ అండదండలతో వాటిని వశపర్చుకోవడమూ కొత్తేమీ కాదు. తాజాగా అర్థబలంతో ఏకంగా రికార్డులు ట్యాంపరింగ్ జరిగిపోతోంది. కంచే చేనుమేసేసినట్టుగా సాక్షాత్తు రెవెన్యూ అధికారులే ఇందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమౌతున్నాయి. ఇందులో విఆర్ఒలు మొదలుకుని మండలం, డివిజన్, జిల్లా స్థాయిలో ఎవరి పాత్రవారు పోషిస్తున్నారట. తాజాగా బయటపడ్డ వాస్తవాలే ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. భోగాపురం మండలంలో ఓ రిటైర్డు ఉద్యోగికి చెందిన భూమిని మరో ప్రభుత్వ అధికారి వశపర్చుకునేందుకు ప్రయత్నించారట. ఉద్యోగికి చెందిన కొంత భూమి అధికారి లేదా ఆయన కుటుంబీకులు, బినామీ పేరున కొంత వరకు ఆన్‌లైన్ డాక్యుమెంట్‌లో చేర్చారన్నది ఆయన అభియోగం. దీనిపై అధికార యంత్రాంగం నుంచి తగిన స్పందన లేకపోవడంతో ఏకంగా ముఖ్యమంత్రి, ప్రభుత్వంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు సంబంధించిన పిజిఆర్ఎస్ (ప్రజాసమస్యల పరిష్కారవేదిక)కు సుమారు 30సార్లు ఫిర్యాదు చేశారట. వీరి ఆదేశాల మేరకు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భోగాపురం మండలంలోని తూడెం గ్రామాన్ని సందర్శించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో రికార్డుల పరిశీలన చేస్తుండగా కౌలవాడ గ్రామానికి చెందిన భూ వివరాలకు సంబంధించి సర్వే నెంబర్ 128లోని వివరాలు ట్యాంపరింగ్ జరిగినట్టు గుర్తించారు. ఎఫ్‌సిఒ రికార్డుల్లో రెండు పేజీలను తొలగించి, ఆ స్థానంలో మరో రెండు పేజీలను అతికించినట్టుగా కూడా సాక్షాత్తు కలెక్టరే ప్రకటించారు. కొత్తగా అతికించిన పేజీల్లో డి.పట్టా జారీ చేసినట్టుగా కూడా ఉంది. వేరు శెనగ కోసం మట్టిని తవ్వితే లంకె బిందె తగిలిందన్నట్టుగా ఒక ఫిర్యాదు పరిష్కారానికి ఒక గంటపాటు మండలంలో పర్యటించిన కలెక్టర్‌కు ఏకంగా రికార్డు తారుమారుచేసిన విషయం బటయ పడింది. ఇది కేవలం మచ్చుకు మాత్రమే. ఇంకా లోతుల్లోకి వెళ్తే... భోగాపురం గ్రీన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు భూ సేకరణ నేపథ్యంలో ఎకరా భూమి ఉన్నవారి పేరున 90 ఎకరాల వరకు రాసి, అలా వచ్చిన డబ్బును అధికారులు, రాజకీయ రాబందులు కాజేశారన్న చర్చ కొన్నాళ్లుగా బహిరంగంగానే నడుస్తోంది. వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను ఇలా బినామీల పేర నమోదు చేసి ప్రభుత్వం నుంచి భారీగా మొత్తాన్ని వసూలు

చేసుకునారనేది ఇప్పటికీ పబ్లిక్‌టాక్‌గా నడుస్తోంది. ఈ మండలంతో పాటు పూసపాటిరేగ, డెంకాడ మండలాల్లో గత ప్రభుత్వ హయాంలో 20ఏళ్లగా సాగులోవున్న అసైన్డ్ భూమిని దళితులకు రెగ్యులర్ చేసేందుకు తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను ఉపయోగించుకుని రూ.కోట్ల విలువైన భూములను వశపర్చు కున్నారన్న చర్చ ఇప్పటికీ కొనసాగుతోంది. ఇందులో జిల్లా అధికారులు, రాజకీయ నాయకులతోపాటు ప్రభుత్వంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన ఐఎఎస్ అధికారులు కూడా ఉన్నారని అప్పట్లో చర్చోపచర్చలు నడిచాయి. అంతకు ముందు ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా కాపాడలేకపోయారన్న అభియోగంతో భోగాపురం, కొత్తవలస సహా ఐదు మండలాల్లో పనిచేసిన తహశీల్దార్లకు నోటీసులు ఇచ్చారు. విచారణ కూడా చేపట్టారు. ఆ తరువాత ఏం జరిగిందో బహిర్గతం కాకుండా చర్యలు తీసుకున్నారు. ఒకానొక దశలో విజయనగరం జిల్లాలో భూ ఆక్రమణలు, రికార్డుల ట్యాంపరింగ్, అసైన్డ్ ల్యాండ్‌లో అక్రమాలు తదితరాలను తేల్చేందుకు గత ఏడాది ఆగస్టు 16న వచ్చిన రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పి సిసోడియా కూడా భోగాపురం మండలంలోనే పరిశీలన చేశారు. అప్పట్లో ఏం గుర్తించారో? ఏమేరకు సరిచేశారో తమకేమీ తెలియదని ఆ ప్రాంతవాసులు చెప్పుకుంటున్నారు. కేవలం ఈ మండలాల్లో మాత్రమే కాదు. వేపాడ, మెంటాడ, ఎస్.కోట గిరిజన ప్రాంత ప్రభుత్వ, అసైన్డ్ భూములపై ఆర్థిక, రాజకీయ బలం ఉన్నవారు మోహరించారు. అధికారులు కూడా డబ్బులు ఇస్తే ఒకలాగా, లేదంటే మరోలాగా వ్యవహరిస్తున్నారనే చర్చనడుస్తోంది. బాడంగి మండలం లక్ష్మీపురం పంచాయతీ ఎరుకుల పాకులకు చెందిన గిరిజన మహిళ దాసరి యమున అదే మండలంలోని కామన్నవలస రెవెన్యూ గ్రామం పరిధిలో పెట్రోల్ బంకు పెట్టుకునేందుకు భూమి కొనుగోలు చేసుకుంది. ఇండియన్ ఆయిల్ కంపెనీ లిమిటెడ్‌తో ల్యాండ్ లీజు ఒప్పందం చేసుకునే క్రమంలో రెవెన్యూ శాఖతో ఎదురైన ఇబ్బందులను అధికారులు పరిష్కరించకపోవడంతో ఆమె ఇప్పటికీ ముందుకు సాగలేపోయారు. విజయనగరం రెవెన్యూ డివిజన్ బొండపల్లి మండలంలో రాజకీయ అండదండలు కలిగిన ఓ వ్యక్తి బంకు ఏర్పాటుకు మాత్రం ఆఘమేఘాలపై అనుమతులు ఇచ్చేశారు. వాస్తవానికి ఇక్కడి భూ వివాదం ఉండడం వల్ల గతంలో పనిచేసిన తహశీల్దార్, ఆర్డీవో తిరస్కరించారు. నాడు అసాధ్యమైంది. నేడు ఎలా సుసాధ్యం అయిపోయిందో రెవెన్యూ అధికారులు, వారిపై పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులకే తెలియాలని స్థానికులు అంటున్నారు. రహదారులు, రైల్వే ట్రాకులు, సాగునీటి కాలువల పేరిట చేపట్టిన భూ సేకరణలోనూ అధికారులు ప్రభుత్వ కళ్లకు గంతలు కడుతున్నారనే విమర్శలు ఊపందుకున్నాయి. వ్యవసాయ భూములను నివాస స్థలాలుగా రికార్డుల్లో చూపించి ప్రభుత్వం నుంచి రెవెన్యూ అధికారులు భారీ మొత్తాలను రాబడుతున్నారని బహిరంగ చర్చనడుస్తోంది. ఇలా చెప్పుకుంటూ పోతే... జిల్లాలో రెవెన్యూ కార్యకలాపాల వెర్రి వెతలు వేస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే భూములన్నీ పెద్దలు, రాజకీయ అండదండలు ఉన్నవారి చేతుల్లోకి వెళ్లిపోవడం ఖాయమనే చర్చ సర్వత్రా సాగుతోంది.

ఆలయానికి రూ.1.70లక్షలు విరాళం

ప్రజాశక్తి - మెరక ముడిదాం

మండలంలోని బైరిపురం వెంకటేశ్వర స్వామి ఆలయానికి, విశాఖపట్నం సీతమ్మధారకు చెందిన చిట్టి బొమ్మ వెంకటరమణ మూర్తి, ఆయన సతీమణి సుజన రూ.1.70లక్షలు విరాళం అందించారు. మూర్తి తండ్రి కీర్తి శేషులు చిట్టి బొమ్మ శ్రీరామ మూర్తి జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తం సొమ్మును బైరిపురం గ్రామానికి చెందిన మూర్తి మిత్రులు లెంక వెంకటరమణ ద్వారా శనివారం ఆలయానికి అందించారు. ఈ సొమ్ముతో ఆలయంలో భక్తులు ప్రదక్షణ చేసే స్థలంలో, శ్రీవారి సేవకులు కమిటీ అధ్యక్షులు ఎస్ఎస్ఆర్ ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో భక్తులు సౌకర్యార్థం టైల్స్ వేయిస్తామన్నారు. ఈ సందర్భంగా శ్రీవారి సేవకులు మూర్తిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి ఆర్థిక సహాయం

భోగాపురం: మండలంలోని గూడెపువలస గ్రామ సర్పంచ్ మట్ట అయ్యప్ప రెడ్డి ఆలయాల నిర్మాణానికి ఆర్థిక సహాయం శనివారం అందించారు. మండలంలోని కొంపెల్లవలస గ్రామ పంచాయతీ జయ్యయ్యపేటలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయానికి 25వేలు రూపాయలు అందజేశారు. గ్రామ పెద్దలకు తన స్వగ్రామంలో ఈ సహాయాన్ని అందజేశారు.

బంగార్రాజుకు ధ్రువపత్రం అందజేత

ప్రజాశక్తి - భోగాపురం

రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు ఇఫ్కో డైరెక్టర్‌గా ఎన్నికైనట్లు సంబంధిత ధ్రువపత్రాన్ని శనివారం అందుకున్నారు. గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో ఇఫ్కో బోర్డు డైరెక్టర్ల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ల సమావేశానికి బంగార్రాజు హాజరయ్యారు. అక్కడ ఆయనకు ధ్రువపత్రాన్ని అందజేశారు.

నృత్యం చేస్తున్న చిన్నారులు

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక రంగాలు, క్రీడలలో రాణించాలని డిప్యూటీ డిఇఒ మోహన్‌రావు, ఎంఇఒ సిహెచ్ లక్ష్మణరావు, శ్రీనిధి పాఠశాల వ్యవస్థాపకులు రౌతు రామమూర్తి, కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు కోరారు. పాఠశాల ఆవరణలో శనివారం ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివితే ఏదైనా సాధించవచ్చునని చెప్పారు. తమ పాఠశాలలో సృజనాత్మక విద్య అందిస్తున్నామని రామమూర్తి, వాసుదేవరావు అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని పరిశీలించిన డిఎస్‌పి

ప్రజాశక్తి - బొబ్బిలి

వేసవి ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రజలు దాహార్తిని తీర్చేందుకు పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన మజ్జిగ చలి వేంద్రాన్ని శనివారం డిఎస్‌పి భవ్యరెడ్డి పరిశీలించారు. చలి వేంద్రం ఏర్పాటుతో సామాజిక కార్యక్రమాలతో పోలీసులు ముందుంటారని నిరూపించారని పట్టణ సిఐ కె.సతీష్ కుమార్‌ను అభినందించారు. చలి వేంద్రానికి వచ్చిన ప్రజలకు మజ్జిగ ఇచ్చి దాహార్తి తీర్చారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డెప్యుటేషన్‌పై పని చేయడానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో డెప్యుటేషన్ పై లెక్చరర్స్‌గా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ జి.పగడాలమ్మ శనివారం ప్రకటనలో తెలిపారు. డెప్యుటేషన్ పద్ధతిపై డైట్ కళాశాలలో 6 సీనియర్ లెక్చరర్స్, 17 లెక్చరర్స్ మొత్తం 23 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. 58 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ఉమ్మడి విజయనగరం జిల్లాలో పనిచేస్తున్న అర్హత గల ఎంఇఒలు, హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్లు ఈ నెల 10 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులకు 16, 17 తేదీలలో రాత పరీక్ష, 19వ తేదీన ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామన్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ కార్యకర్త మృతి

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని మార్లపల్లి గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ గేదెల కృష్ణవేణి (45) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్ని రోజులు నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద మృతి చెందినట్లు తెలిపారు. ఆమె మృతి పట్ల సిడిపిఒ ఉమా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, కొత్తవలస ప్రాజెక్టు అధ్యక్షులు కాకర తులసి, జయలక్ష్మి, వరలక్ష్మి శేషు నాగమణి తదితరులు సంతాపం తెలిపారు.

కర్రల మిషన్‌లో పడి మహిళ మృతి

ప్రజాశక్తి - గంట్యాడ

మండలంలోని సిరిపురం సచివాలయం పరిధిలో ఉన్న స్థలంలో కర్రలకు తొక్క తీసిన మిషన్‌లో పడి అసుకపల్లి జ్యోతి (29) అక్కడికక్కడే మృతి చెందింది. శనివారం కర్రలకు తొక్కతీసే మిషన్ వద్ద పని చేస్తున్న సమయంలో ఆమె ప్రమాదవశాత్తు మిషన్‌లో పడటంతో ఒక్కసారిగా మిషన్ లోపలికి లాగేసింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. లక్కిడాం గ్రామానికి చెందిన జ్యోతి గత 15 రోజుల నుంచి ఆ పని చేయడానికి కొంత మంది మహిళలతో కలిసి వస్తున్నట్లు చెబుతున్నారు. మృతురాలికి భర్త పరదేశినాయుడు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ సాయికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- బొండపల్లి

మండలంలోని గరుడబిల్లి గ్రామానికి చెందిన సుంకరి ఈశ్వర రావు అక్రమంగా తరలిస్తున్న 65 మద్యం సీసాలను శనివారం స్వాధీనం చేసుకుని అతన్ని అరెస్టు చేశామని ఎస్ఐ. యు మహేష్ తెలిపారు. ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

స్వచ్ఛ గ్రామాల ఆశయం నెరవేరేనా..?

- ముందుకు కదలని ప్రభుత్వ లక్ష్యాలు • నిర్మాణాల్లో జాప్యం..పర్యవేక్షణ లోపం.. •సంపద సృష్టి కేంద్రాలకు శాపంగా నిర్వహణ •మరికొన్నిచోట్ల నిరుపయోగంగా షెడ్లు

ప్రజాశక్తి - రేగిడి

రాజాం నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ఉన్న గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు కోసం ప్రభుత్వాలు 2016లో చెత్త నుండి సంపద సృష్టి తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. దీంతో కొన్ని గ్రామాల్లో సంపద సృష్టి కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ, మరికొన్ని గ్రామాల్లో స్థల సమస్య ఏర్పడింది. మరి కొన్ని పంచాయతీల్లో నిర్మించినా ఆచరణ లేక అలంకారప్రాయంగానే ఉన్నాయి. జిల్లా అధికారుల పర్యవేక్షణ లోపమే చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాలకు శాపంగా మారింది.

గత టిడిపి హయాంలో చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాలు గ్రామపంచాయతీలు ద్వారా నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. కొంతమేర మెరుగ్గా ఉన్నా, వైసిపి ప్రభుత్వం జగనన్న సంకల్పం పేరుతో పూర్తిగా పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో అపారిశుధ్యం నెలకొంది. దీంతో ఎక్కడ చెత్త అక్కడే అన్న చందంగా తయారైంది.

రాజాం నియోజకవర్గంలో రేగిడి, సంతకవిటి, వంగర, రాజాం మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో 120 గ్రామపంచాయతీలు ఉన్నాయి. నియోజకవర్గంలో పలు కేంద్రాలు పూర్తికాగా, పలు కేంద్రాలు ఇంకా నిర్మాణంలో కొట్టుమిట్టాడుతున్నాయి. నిర్మాణాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జిల్లా సమీక్ష సమావేశాలలో ఆదేశిస్తున్నా ఆచరణలో పూర్తి కావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

చెత్త నుంచి సంపద ఏదీ?

సంపద తయారీ కేంద్రాలు పూర్తయినా ఆ కేంద్రాల్లో చెత్త నుండి సంపద తయారీ మాత్రం జరగడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో చెత్తను తీసుకువచ్చి బహిరంగ ప్రాంతాల్లో వేయడం, అవి దుర్గంధ భరితంగా మారడంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. కొన్ని గ్రామాల్లో చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాలు లేకపోవడంతో రోడ్లపైనే తడి పొడి చెత్త వేస్తున్నారు. చెత్త వేసిన తరువాత నిప్పు పెట్టడంతో ఆ పొగ కారణంగా ఆ ప్రాంత ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని చెబుతున్నారు.

సంకిలిలో రోడ్డు పైనే చెత్త వేస్తున్న గ్రీన్ అంబాసిడర్

గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు కరువు

గ్రామాలను స్వచ్ఛ సంకల్ప గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు గ్రామాల్లో చెత్తను ఎత్తి కేంద్రాలకు తరలిచేందుకు గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ నుంచి వీరికి వేతనాలు, వాహనాలు సమకూరుస్తుందని, గ్రామాల్లో చెత్తలను వాహనాల ద్వారా సంపద తయారీ కేంద్రాలకు తీసుకువెళ్లి వాటిని తడి, పొడి చెత్తగా వేరుచేసి ఎరువుగా తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. తయారైన ఎరువులు రైతులకు విక్రయించి తద్వారా వచ్చే ఆదాయాన్ని ఆయా గ్రామ పంచాయతీలు తీసుకోవచ్చని చెప్పింది. అయితే గ్రీన్ అంబాసిడర్లకు సకాలంలో జీతాలివ్వక ప్రణాళికలు కాగితాల్లోనే తప్ప ఆచరణలో జరగడం లేదు. సంబంధిత శాఖాధికారులు కూడా ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. బాధ్యతగా ఉండాల్సిన ఇఒపిఆర్‌డిలు కూడా ఈ సమస్యను పరిష్కరించడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పర్యవేక్షణ లోపం

జిల్లా అధికారుల పర్యవేక్షణ అసలే లేదు. దీంతో మండల స్థాయి అధికారులు నిద్రమత్తులో కాలయాపన చేస్తున్నారు. గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ పాలకవర్గం అధికారులు వచ్చే సమయంలో రోడ్ల పైన బ్లీచింగ్ పౌడర్ జల్లించి చేతులు దులుపుకుంటున్నారని పలువురు విమర్శిస్తున్నారు. నియోజకవర్గం పరిధిలో రేగిడి మండలంలో 39 గ్రామ పంచాయతీలుండగా 27 పంచాయతీల్లో సంపద సృష్టి కేంద్రాలు ఏర్పాటు చేశారు. సంకిలి, ఉంగరాడ, వన్నలి కండ్యాం, కొమిరి, చిన్నిశిర్లాం పంచాయతీల్లో పూర్తిగా నిర్మాణాలు చేపట్టలేదు. కోడిస, అప్పాపురం, దేవుదల వివిధ స్థాయిలో ఉన్నాయి. సంతకవిటి మండలంలో 34 పంచాయతీలకు 23 సంపద సృష్టి కేంద్రాలు పూర్తయ్యాయి. మిగిలినవి స్థలాలు లేక పూర్తి కాలేదు. వంగర మండలంలో 27 గ్రామ పంచాయతీలుండగా కేవలం 14 మాత్రమే నిర్మించారు. మిగిలినవి నిర్మించలేదు. రాజాం మండలంలో 20 పంచాయతీలుండగా 14 కేంద్రాలు పూర్తయ్యాయి. మిగిలినవి స్థలాలు లేక నిర్మాణాలు చేపట్టలేదు. నిర్మాణాలు జరగకపోతే స్వచ్ఛ గ్రామాల ఆశయం నెరవేరేనా అని గ్రామీణ ప్రజలు ఎదురుచూస్తున్నారు. జిల్లా అధికారులు మండల కేంద్రాల్లో సంపద తయారీ కేంద్రాలను పరిశీలించి, పూర్తిస్థాయిలో ప్రభుత్వ లక్ష్యాలను నెరవేరేలా చూడాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. ప్రజాధనం వృథా కాకుండా ఆచరణలోకి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంపద సృష్టి కేంద్రాల నిర్మాణాలకు కృషి

గ్రామాల్లో సంపద సృష్టి కేంద్రాలు నిర్మాణాలకు కృషి చేస్తాం. 2016లో ఈ పథకం ప్రారంభమైంది. పంచాయతీల్లో నిర్మాణాలు చేపట్టారు. మరి కొన్ని పంచాయతీల్లో నిర్మించిన ఆచరణలో లేవు. కేంద్రాలు లేని పంచాయతీలను గుర్తించి నిర్మాణాలు చేపడతాం. నిర్మాణం పూర్తయిన వాటిని వినియోగంలోకి తీసుకొస్తాం.

శ్యామల కుమారి, ఎంపిడిఒ, రేగిడి

విద్యుత్, రెవెన్యూ సమస్యలపై నిలదీత

ప్రజాశక్తి- మెరక ముడిదాం

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిపి తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందుగా జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ప్రజా ప్రతినిధులు ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, భారత దేశ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో సభ్యులు విద్యుత్, రెవెన్యూ సమస్యలపై అధికారులను నిలదీశారు. విద్యుత్ శాఖ ఎఇ దివాకర్ విద్యుత్ శాఖ పనితీరుపై వివరిస్తుండగా, గర్భాం మేజర్ పంచాయతీ సర్పంచ్ గాబ్రియేల్ కల్పించుకొని మండలంలో తగిన ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడం వల్ల లోఓల్టేజీ సమస్య వేధిస్తుందన్నారు. ఫలితంగా రైతులు మోటార్లు తరచు కాలిపోతున్నాయని, ఎన్నిసార్లు సమావేశంలో మొరపెట్టుకున్నా ట్రాన్స్ ఫార్మర్లు అధికారులు ఏర్పాటు చేయటం లేదని మండిపడ్డారు. దీనికి స్పందించిన ఎఇ అగ్రికల్చర్ ఫీడర్లో కొత్త స్కీం వస్తుందని రైతులు ముందుకు వస్తే విద్యుత్ కనెక్షన్స్ క్రమ బద్ధీకరణ చేసి ట్రాన్స్ ఫార్మార్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ శాఖలో మ్యుటేషన్స్, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు వంటివి చేయడానికి అధికారులు తాత్సరం చేస్తున్నారని, మండల ఉపాధ్యక్షులు తలచుట్ల హరిబాబు లేవనెత్తారు. ఏ పనికోసమైనా రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్ళు అరిగేలా తిరగవలసి వస్తుందని అన్నారు. సమావేశంలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారులందరూ ప్రజలు సమస్యలు తెలుసుకొని ఆ సమస్యలు తీర్చే విధంగా ఉండాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు, విద్యార్థులకు ఇబ్బంది పెట్ట వద్దు అని అన్నారు. పార్టీలకు అనుగుణంగా కాకుండా, పార్టీ రహితంగా అందరికీ పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ భాస్కరరావు, తహశీల్దార్ రఫిజన్, వైస్ ఎంపిపి టి. హరిబాబు, కందుల పార్వతి, అన్ని శాఖల అధికారులు, సర్పంచ్లు, ఎంపిటిసి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

పోలవరం కాలువ డిజైన్ మార్చాల్సిందే?

ప్రజాశక్తి - వేపాడ

పోలవరం డిజైన్ వల్ల వేలాది రైతులు నష్టపోయి నిరాశ్రయులు అవుతున్నారని, పోలవరం ఎడమ కాలువ డిజైన్ మార్చాల్సిందేనని నిర్వాసితుల పోరాట కమిటి కన్వీనర్ చల్లా జగన్ డిమాండ్ చేశారు. శనివారం పోరాట కమిటీ ఆధ్వర్యంలో రైతులు వేపాడలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల డిమాండ్ మేరకు జిల్లా కలెక్టర్ గ్రామసభలు నిర్వహిస్తే అన్ని గ్రామసభల్లో డిజైన్ మార్చాలని ఏకవాక్య తీర్మానం చేశారన్నారు. ఆ గ్రామసభల తీర్మానాన్ని అధికారులు ప్రభుత్వం ఎంతవరకు పరిగణలో తీసుకున్నారో తెలియలేదన్నారు. డిజైన్‌లో ఉన్న సర్వే నెంబర్లలోని భూమిని అమ్మకోవడానికి, కొనుక్కోవడానికి వీలు లేకుండా ఉన్నందువల్ల పిల్లలు పెళ్లిళ్లకు ఇతర అవసరాలకు రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతుల సాగునీటి అవసరం కోసమని 2017లో తయారు చేసిన ప్రాజెక్ట్ రూపకల్పనకి ఇప్పటికీ చాలా వ్యత్యాసం ఉందన్నారు. కొన్ని భూములు తోటలగాను మరికొన్ని భూములు రియల్ ఎస్టేట్ గాను మారిపోయాయన్నారు. అందువల్ల అంత పెద్ద సైజు కాలు ఇప్పుడు అవసరం లేదన్నారు. నిజంగా రైతులకు సాగునీరు ఇవ్వదలిస్తే రైవాడ, తాటిపూడి నీరు రైతులకు ఇచ్చి పోలవరం కాలువ నీరు విశాఖ వాసులకు, పారిశ్రామిక వాసులకు ఇచ్చి ప్రభుత్వ ఖర్చులను తగ్గించడమే కాకుండా వేలాది మంది రైతుల నిరాశ్రయులు అవ్వకుండా చేయవచ్చు నన్నారు. ఈ అంశాలపై చర్చించడానికి రైతులతో ఈ నెల 7న కొండగుళ్ల వద్ద మరోసారి సమావేశం నిర్వహించనున్నామని రైతులంతా హాజరు కావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పోరాట కమిటీ నాయకులు జక్కాన సింహాద్రి అప్పడు, లక్కవరపుకోట మాజీ ఎంపిపి జక్కన్న కన్నబాబు, నక్క కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చల్లా జగన్

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - వేపాడ

పిఎంఇజిపి రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు రుణాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోంపురం గ్రామానికి మూడు ఆటోలు మంజూరు చేశామన్నారు. ఒక్కొక్క ఆటోకి రూ.3లక్షల చొప్పున రుణం మంజూరు కాగా సబ్సిడీ కింద రూ.1.05లక్షలు చెల్లించాల్సిన పనిలేదని మిగతా సొమ్మును లబ్ధిదారులు జగడ అప్పారావు, చింతల అవతారం, పొట్నూరు లక్ష్మి చెల్లించాలన్నారు. ఫొటో స్టూడియోకు రూ.5లక్షలు రుణం మంజూరు చేశామని ఇందులో రూ.1.15లక్షలు సబ్సిడీ పోను మిగితా సొమ్మును చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎన్‌కేఆర్‌పురం సర్పంచ్ గొటివాడ దేవికు నర్సరీ యూనిట్ కోసం రూ.2.50లక్షలు రుణం మంజూరు చేశామన్నారు. ఈ రుణాలను సక్రమంగా వినియోగించుకుని ఆర్థికాభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం సన్యాసిరావు, మండల టిడిపి నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఎన్యుమరేటర్ల శిక్షణ

ప్రజాశక్తి -చీపురుపల్లి

మండల సమాఖ్య కార్యాలయంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఎన్యుమరేటర్ల శిక్షణ తరగతులు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు మాట్లాడుతూ శిక్షణ పొందిన ఎన్యుమరేటర్లు గ్రామాల వారీగా గ్రామ సంఘాలను, చిన్న చిన్న సంఘాల సమావేశాలు ఏర్పాటు చేసి 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సభ్యుల వారీగా అధికారులు తెలిపిన యాప్ ద్వారా వారి పేర్లను నమోదు చేయాలన్నారు. ప్రతి సభ్యురాలు జీవనోపాదికి, వారి కుటుంబ అవసరాలకు అవసరమయ్యే అప్పును ముందుగానే ఎన్యూమరేటర్స్ ద్వారా యాప్‌లో నమోదు చేయాలని అధికారులు సూచించారు. తక్షణమే సీసీలు గ్రామాలలో గ్రామ సంఘాల సమావేశాలు ఏర్పాటు చేసి ఎస్‌హెచ్‌జి సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ స్త్రీ నిధి ఎజిఎం ఎ.ఉమామహేశ్వరరావు, మేనేజర్ వై ఎర్రి నాయుడు సీసీలు, విఓఎలు పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని గ్రావెల్ అక్రమ తవ్వకాలపై రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని వివిధ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. లింగాలవలస సమీపంలో చెరుకుపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి శనివారం గ్రావెల్ అక్రమంగా తరలించుకుపోయారని గ్రామస్తులు చెబుతున్నారు. దీనిపై రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని వాపోతున్నారు. చెరుకుపల్లి కొండపై కూడా గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారని రెవెన్యూ అధికారులకు తెలిసినప్పటికీ చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఈ గ్రావెల్ అక్రమ తవ్వకాలపై రెవెన్యూ అధికారులు స్పందించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

'విద్యుత్ స్మార్ట్ మీటర్లు మా కొద్దు'

ప్రజాశక్తి - బొబ్బిలి

విద్యుత్ స్మార్ట్ మీటర్లు తమ ఇంటికి పెట్టవద్దని సిపిఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో శనివారం ఎం.బూర్జవలసలో ప్రచారం చేశారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేసి ట్రూ ఆఫ్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటును వ్యతిరేకించిన టిడిపి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారం మోపడం సరికాదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు గాడి అప్పారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ అన్నారు. పట్టణంలో సిపిఎం ఆధ్వర్యంలో 'మా ఇంటికి స్మార్ట్ మీటర్ల వద్దు, కరెంట్ ఛార్జీలు తగ్గించాలి' అనే గోడ పత్రికను శనివారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తూచా తప్పకుండా గత వైసిపి ప్రభుత్వం వలే, ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కూడా అవలంభిస్తుందన్నారు. అందు వల్ల 2014 నుండి 2025 వరకు ప్రజలు వినియోగించిన విద్యుత్తుకు బిల్లులు చెల్లించినప్పటికీ మరల ప్రజల పైన రూ.1.40 లక్షల కోట్లు ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో సర్ ఛార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపుతున్నారని అన్నారు. అదానీ కంపెనీలో తయారు చేసిన స్మార్ట్ మీటర్ల అమ్ముడుపోయే విధంగా ప్రజలకు బలవంతంగా ఇళ్లకు, షాపులకు, ఉచితంగా విద్యుత్తును వినియోగించుకుంటున్న రైతన్నలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం రైతుల మోటార్లకు బిగించిన స్మార్ట్ మీటర్లను చితగ్గొట్టిన టిడిపి ప్రభుత్వం నేడు అధికారంలోకి వచ్చేసరికి అప్పుడు తప్పని చెప్పి ఇప్పుడు రైట్ ఎలా అయ్యిందని ప్రశ్నిస్తున్నామన్నారు. మీరు సంపద సృష్టించడం అంటే ప్రజలపై అనేక రూపాల్లో భారాలు వేసి ఆర్థికంగా ప్రజల నడ్డి విరచడమేనా అని మండిపడ్డారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం బలవంతంగా విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగించొద్దంటూ సిపిఎం ఆధ్వర్యంలో పోస్టరు విడుదల చేశారు. బలవంతంగా స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలపై విద్యుత్తు భారాలను వేస్తే గతంలో బషీరాబాద్‌లో జరిగిన విద్యుత్ పోరాటాన్ని సవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజలను రైతులను కార్మికులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మద్దిల గోవిందరావు, సింహాచలం, షణ్ముక్, కె త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

దార్శనికుడు జగ్జీవన్ రామ్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

వ్యక్తి, సమానత్వం, సౌభ్రాతత్వం ప్రాతిపదికనే దేశ సమైక్యత సాధ్యపడుతుందని చాటిన జాతీయవాది, దార్శనిక నాయకుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు అన్నారు. శనివారం యుటిఎఫ్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ గాంధీజీ అహింసా సిద్ధాంతం ప్రభావంతో అట్టడుగు వర్గాలకు కూడా రాజకీయ ప్రాతినిధ్యం దక్కాలని ఆయన ఉద్యమించారని, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించి తద్వారా కింది వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం చేరువయ్యేలా చేయడంలో ఆయన చేసిన కషి మరువరానిదని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, జిల్లా కోశాధికారి సిహెచ్ భాస్కరరావు, రాష్ట్ర విద్యా సంబంధ అధ్యయన కమిటీ సభ్యులు డి.రాము, జిల్లా కార్యదర్శులు కె. ప్రసాదరావు, సిహెచ్ తిరుపతినాయుడు, జి.రాజారావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పీ రాంప్రసాద్, డి.సన్యాసిరావు పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్

పేదల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్ అని దళిత బహుజన శ్రామిక

జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిబిఎస్‌యు ప్రతినిధులు

కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం సాధనకు, అంటరానితనం నిర్మూలనకు ఆయన చేసిన కృషి అభినందనీయమని అన్నారు. సుదీర్ఘంగా కేంద్ర కేబినెట్ లో అనేక పదవులను అలంకరించి చిత్తశుద్ధితో పనిచేసిన ఆయనకు కుల వివక్షత కారణంగానే దేశానికి ప్రధాని కాలేకపోవడం సామాజిక న్యాయానికి మాయని మచ్చగా మిగిలిపోయిందని అన్నారు. ఇప్పటికైనా సామాజిక న్యాయం కాపాడాలని పిలుపునిచ్చారు. డిబిఎస్‌యు కన్వీనర్ మొండూరి పోతురాజు, డొమెస్టిక్ వర్కర్స్ జిల్లా కోఆర్డినేటర్ కోరుకొండ వరలక్ష్మి, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు యందవ పోలయ్య, ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు ఉప్పాడ రాము, దళిత ఆదివాసి మహిళా సంఘ కన్వీనర్ పీరుబండి సత్యవతి తదితరులు పాల్గొన్నారు

నగర పాలక సంస్థ కార్యాలయంలో..

నగర పాలక సంస్థ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ పల్లి నల్లనయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అనగారిన వర్గాల అభ్యున్నతికి అలుపెరుగని పోరాటం చేసిన మహా సంఘసంస్కర్త జగజీవన్‌రామ్ అని కొనియాడారు. ఉద్యోగ సంఘం అధ్యక్షులు నర్సింగరాజు తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో..

జెఎన్‌టియు విశ్వవిద్యాలయం గురజాడలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూ జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఉప కులపతి ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో...

సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. ఆయన ఎంతో అంకితభావంతో పనిచేసి దేశానికి ఎంతో సేవనందించారని కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశిభూషణరావు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్లు కెప్టెన్ ఎం.సత్యవేణి, ఎం. ఉదయ్‌కిరణ్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూరపు నాయుడు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

బొబ్బిలి: స్థానిక ఎక్సైజ్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి టిడిపి సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, దళిత ఉద్యోగ సంఘాల నాయకులు పి.అప్పయ్య, ఎస్.టి.యు నాయకులు జోగారావు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోటరీ ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన రహదారిలో ఉన్న జగ్జీవన్ విగ్రహానికి రోటరీ జిల్లా అధ్యక్షులు జెసి రాజు, క్లబ్ అధ్యక్షులు సింద్రీ శ్రీనివాసన్ పూల మాల వేసి నివాళులర్పించారు.

నెల్లిమర్ల: నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నగర పంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజిని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కమిషనర్ కె. అప్పలరాజు పూలమాలలు వేసి నివాళాలు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లెంక అప్పల నాయుడు, నగర పంచాయతీ సిబ్బంది, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

డెంకాడ: చింతలవలస 5వ బెటాలియన్ ఆవరణలో గల యూనిట్ కళ్యాణ మండపంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి బెటాలియన్ అదనపు కమాండెంట్ జి. లక్ష్మి నారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బెటాలి యన్ అసిస్టెంట్ కమాండెంట్ డి.వి.రమణమూర్తి యూనిట్ ఆఫీసర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ: మండల కేంద్రంలోని వల్లంపూడి, ఎన్‌కెఆర్‌పురం, బల్లంకి గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, మాజీ డిసిసిబి చైర్మన్ వి.వి.చిన రాము నాయుడు, దళిత సంఘాల నాయకులు కొమనాపల్లి రాము, అప్పారావు, సోషల్ యాక్టివిస్టు గుత్తు శ్రీను, బి.కిరణ్, అప్పలరాజు, వీరేశు, అప్పారావు, వైసిపి మండల అధ్యక్షులు జగ్గుబాబు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబు జగజ్జీవన్ రామ్ అని ఆరికతోట మాజీ సర్పంచ్ పెంకి భీమయ్య అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆరికతోట జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంకి శేఖర్‌బాబు, ఎంఆంపిఎస్ జిల్లానేత సుధాకర్, ప్రధాన కార్యదర్శి ఆనంద రావు, వివిధ సంఘాల నాయకులు రేజేటి అప్పా రావు, జయశీలరాజు, కిల్లాడ రాజు పాల్గొన్నారు. ఇదే గ్రామంలో ఎస్‌సి కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రామ్ విగ్రహానికి అంబేద్కర్ యూత్ అసోసియేషన్ తరుపున యజ్జల అప్పారావు (బుజ్జి) ఆధ్వర్యంలో ఆ సంఘం నేతలు సురగాల సన్యాసి రావు, పెంకి రవికుమార్, ప్రసన్న, రమేష్ స్థానిక టిడిపి నేతలు పల్లా చంద్రరావు, నల్ల కుర్మారావు, స్వామినా యుడుల ఆధ్వర్యంలో పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

పబ్లిక్ నోటీస్

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ అయిన విజయనగరం జిల్లా, డెంకాడ మండలం, గుణుపూరు గ్రామ కాపురస్తులు **పైల సత్యనారాయణ,** S/o రామునాయుడు ఇచ్చిన బోగట్టా ప్రకారం నా క్లయింట్ యొక్క ఒరిజినల్ దస్తావేజులు మరియు ఇతర దస్తావేజులు జెరాక్స్ నిమిత్తము తేది 05-05-2024దిన నా క్లయింట్ ఇంటి వద్ద నుండి విజయనగరం ఆర్టిసి కాంప్లెక్స్‌కు వెళ్లి అక్కడికి వచ్చేసరికి, సదరు దస్తావేజులను అక్కడ జెరాక్స్ అతనికి ఇచ్చుటకు చూడగా అందులో దస్తావేజు నెంబరు. 979/2022 కనబడలేదు. వచ్చిన దారి వెంబడి వెతకగా సదరు దస్తావేజులు కనిపించలేదు. చుట్టూ ప్రక్కలవారిని దస్తావేజు గురించి వాకబు చేయగా ఎవరికి దొరకలేదని చెప్పియున్నారు. నా క్లయింట్ విషయమై వన్ టౌన్ పోలీసు స్టేషన్, విజయనగరం వారికి సదరు దస్తావేజులు పోయినవని ఫిర్యాదు చేసియున్నారు. (అప్లికేషన్ నెం:MLD022400427612 Date: 30-05-2024) సదరు ఒరిజినల్ దస్తావేజు ఎవరికైనా దొరికన యెడల క్రింద నెంబరుకు సంప్రదించి అందజేయగలరు. అటులకాక సదరు ఒరిజినల్ దస్తావేజుతో ఏ విధమైన చట్ట వ్యతిరేక చర్యలు చేయరాదని, అట్టివి చట్టరీత్యా చెల్లనేరవని, అట్టివి చెల్లనేరవని ఇందుమూలముగా పత్రికా ప్రకటన చేయడమైనది.

Alti Divya Sree
Advocate,
Vizianagaram, Cell: 8106077135.